

అంగన్వాడీలను యథాస్థానంలో కొనసాగించాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

అంగన్వాడీ సమస్యల పరిష్కారం చేయాలని, టీచర్లను యథాస్థానంలో కొనసాగించాలని సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చంద్రారెడ్డి పి. వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. బుధవారం సిఐటియు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో 186 అంగన్వాడీ కేంద్రాలున్నాయని, కొన్నింటికి ఇంతవరకు గ్యాస్ సిలిండర్లు, పొయ్యి ఇవ్వలేదని తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలు సొంత డబ్బులతోనే వాటిని సమకూర్చుకుని విధులు నిర్వహిస్తున్నారు. ఎప్పుడో కుక్కర్లు ఇచ్చారని ఇప్పటి వరకు కొత్తవి ఇవ్వలేదని వాపోయారు. నగరంలో చాలా సెంటర్లకు సొంత భవనాలు లేవని అద్దె భవనాలకు అద్దెలు సైతం అంగన్వాడీ కార్యకర్తలే చెల్లించి కేంద్రాలను నడుపుతున్నారని పేర్కొన్నారు. కార్యకర్తల పైన కడప సిడిపిఒ కక్ష సాధింపు మానుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.

రిజిస్ట్రేషన్ ఛార్జీల ధరవు

జిల్లాలో రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుదలకు రంగం సిద్ధమైంది. ప్రభుత్వం నెల రోజుల కిందటి నుంచి రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచనున్నామని హెచ్చరిస్తున్న సంగతి తెలిసిందే. వ్యవసాయ భూములు మొదలుకుని మున్సిపాలిటీల్లోని స్థలాలు, ఎన్‌హెచ్ జాతీయ రహదారి రులను ఆనుకుని ఉన్న స్థలాలు, భూములకు 30 శాతం చొప్పున ధరలు పెరగనుండడం గమనార్హం. గురువారం నుంచి పెరగనున్న రిజిస్ట్రేషన్ ఛార్జీల ధరలు అమల్లోకి రానుండడం ఆందోళన కలిగిస్తోంది.



30 శాతం ధరల పెంపు - నేటి నుంచి అమల్లోకి..

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

కడప, అన్నమయ్య జిల్లాల్లో 12 చొప్పున 24 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలోని మున్సిపల్ స్థలాలు, వ్యవసాయ భూములు, జాతీయ రహదారి ఆధారిత భూములకు, ఇతర కమర్షియల్ స్థలాలకు 30 శాతం చొప్పున ధరలు పెరగనున్నాయి. ప్రభుత్వ ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. కడప జిల్లాలో కడప, ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు, కమలాపురం, యర్రగుంట్ల, పులివెందుల, బద్వేల్, రాజంపేట, రైల్వేకోడూరు మున్సిపాలిటీలు, అన్నమయ్య జిల్లాలోని రాయచోటి, రాజంపేట, మదనపల్లి, తదితర మున్సిపాలిటీల్లో క్రయ, విక్రయాలు జోరుగా సాగుతున్న సంగతి తెలిసిందే. వీటి పరిధిలోని స్థలాలు, వ్యవసాయ భూములు, ఎన్‌హెచ్ ఆధారిత స్థలాలు, భూ ములు పెద్దఎత్తున ఉన్నాయి. కమర్షియల్ వ్యవహారం ముడిపడిన నేపథ్యంలో ప్రతి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో వందలాది రిజిస్ట్రేషన్ల కార్యకలాపాలు సాగుతున్న సంగతి తెలిసిందే. వీటితోపాటు కమర్షియల్ ప్రాధాన్యత కలిగిన కొన్ని గ్రామీణ ప్రాంతాల్లోని స్థలాలకు, వ్యవసాయ భూములకు, జాతీయ రహదారి ఆధారిత భూములకు, ఇతర కమర్షియల్ స్థలాలకు ధరలు పెరగనున్నాయి. ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ప్రభుత్వం సుమారు రూ.40 కోట్ల నుంచి రూ.60 కోట్ల ఆదాయ సముపార్జన లక్ష్యాల్ని నిర్దేశించిన సంగతి తెలిసిందే. తాజా రిజిస్ట్రేషన్ ఛార్జీల ధరల పెరుగుదల నేపథ్యంలో అటు ప్రజలతోపాటు, ఇటు రిజిస్ట్రార్ కార్యాలయ అధికారుల్లో సైతం నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తుండడం గమనార్హం.

బోగస్ భాగోతంపై విచారణేది?



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైద్య ఆరోగ్య శాఖ బోగస్ బాగోతం విచారణపై నిర్లక్ష్యం రాజ్య మేలుతోంది. 2022 నవంబర్, డిసెంబర్ మాసాల్లో చేపట్టిన 291 స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీలో సర్టిఫికెట్ల పరిశీలన వ్యవహారం సక్రమంగా చేపట్టకపోవడంతో సుమారు 21 మంది అనర్హులకు ఉద్యోగాలు లభించడంపై అప్పట్లో గందరగోళం నెలకొన్న సంగతి తెలిసిందే. చిత్తూరు జిల్లా పూతలపట్టు ప్రాంతానికి చెందిన ఓ స్టాఫ్‌నర్స్ నియామకం విషయంలో చోటుచేసుకున్న నిర్లక్ష్యపు ఉదంతానికి సూపరింటెండెంట్‌పై సస్పెన్షన్ వేటుపడింది. ఆయనపై అప్పట్లో పోలీస్ కేసు కూడా నమోదు చేసిన సంగతి తెలిసిందే. నిజానిజాలను విచారణ చేసి తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉంది. సుమారు ఆర్నెల్లగా పోలీస్, డిపార్టుమెంట్ విచారణల్లో ఎటువంటి కదలిక లేకపోవడంతో సస్పెన్షన్‌లోనే మగ్గుతున్నట్లు సమాచారం. విచారణ కమిటీలో సస్పెన్షన్ చేసిన పూర్వ ఆర్‌డి, ప్రిన్సిపల్ సెక్రటరీ, డిప్యూటీ ప్రిన్సిపల్ సెక్రటరీలు సంయుక్తంగా విచారణ చేపట్టాల్సి ఉంది. ఎస్ఆర్ రిమార్క్స్ పరిశీలన, ఇతర శాఖాపరమైన క్రమశిక్షణ తదితర రిమార్క్సును పరిశీలన చేసే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. విచారణ అనంతరం ప్రభుత్వ నిబంధనల మేరకు గతంలో పనిచేసిన ప్రదేశంలో గాకుండా ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాల్సి ఉన్నట్లు సమాచారం. విచారణే చేపట్టని నేపథ్యంలో బోగస్ బాగోతంపై విచారణలో ఎప్పటికి కదలిక వస్తుందో తెలియడం లేదు.

విచారణ చేపట్టాం

ఆర్‌డి సూప రింటెండెంట్‌పై విచారణ చేపట్టాం. పూర్వ ఆర్‌డి డాక్టర్ కోటేశ్వరి చెన్నైలో ఉన్న కారణంగా హాజరు కాలేనని తెలిపారు ప్రిన్సిపల్ సెక్రటరీ, డిప్యూటీ ప్రిన్సిపల్ సెక్రటరీ అధికారులు విచారణ చేపట్టారు. విచారణ అనంతరం ఇచ్చే రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశాలను అమలు చేస్తాం.

- డాక్టర్ అనిల్‌కుమార్, ఆర్‌డి, కడప.

పాడి రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం : కలెక్టర్

ప్రజాశక్తి - కడప/కడప అర్బన్

పాడి రైతుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, ఎలాంటి నష్టం లేకుండా పాల సేకరణ చేపట్టాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబంధితాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లాలోని 25 విస్తరణ గ్రామాల పరిధిలో పాడి రైతుల నుంచి పాల సేకరణ ప్రక్రియ సక్రమంగా చేపట్టేందుకు జగనన్న పాల వెల్లువ, అముల్ ప్రాజెక్టు నిర్వహణలో భాగంగా సంబంధిత అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గ పరిధిలోని 25 విస్తరణ గ్రామాలలో పాల ఉత్పత్తి దారుల నుంచి పాల సేకరణ ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలన్నారు. పాల ఉత్పత్తి తక్కువగా ఉన్న గ్రామాల్లో రైతులను ప్రోత్సహించాలన్నారు. జిల్లా సహకార బ్యాంకుల నుంచి స్వయం సహాయక సంఘాలకు పశువుల కొనుగోలు, యూనిట్ల ఏర్పాటుకు రుణాలు అందివ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి సుభాషిణి, ఎపిడి డిసిఎఫ్ పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎల్. వెంకటేశ్వరమ్మ, పశుసంవ ర్ధక శాఖ జెడి డా. శారదా, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి : గ్రామ స్థాయిలో వైద్యారోగ్య శాఖలో వైద్యాధికారులు, అనుబంధ శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సభా భవన్ లో అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాదర్ వలిలతో కలిసి వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో గౌరవప్రదమైందని, వైద్యులు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు ఆరోగ్య స్థితిపై సచివాలయ ఎఎన్ఎం, ఆశావర్కర్, అంగన్వాడీ కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. సచివాలయ స్థాయి నుండి మండల స్థాయి వరకు వైద్య, ఐసిడిఎస్ సిబ్బంది సమన్వయంతో కలిసి పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎఎన్ఎం, ఆశా, సిహెచ్‌ఒలతో ప్రతి వారమూ సమావేశం ఏర్పాటు చేసుకుని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డిప్యూటీ డిఎంహెచ్‌ఒలు, ప్రోగ్రాం ఆఫీసర్లు, మండల నోడల్ అధికారులు వైద్యాధికారులు పాల్గొన్నారు.

ప్లస్ టు కళాశాలలు ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్



డిప్యూటీ సిఎంకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

రాష్ట్ర వ్యా ప్తంగా ఉర్దూ మీడియం ప్లస్ టు కళాశాలలు ఏర్పాటు చేయాలని 292 ఇంగ్లీష్ మీడియం ప్లస్ టు కళాశాలలలో మైనారిటీ విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉర్దూ పిజిటి పోస్టులు భర్తీ చేయాలని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి అంజాద్ బాషాకు రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ హిదాయతుల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ వినతి పత్రం అందజేశారు. నగరంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం వారు కలిసి మాట్లాడారు. రాష్ట్ర రెండో అధికార భాష ఉర్దూను విద్యా సంస్థలలో పటిష్టంగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రూట రాష్ట్ర సమన్వయకర్త ముహమ్మద్ అయ్యూబ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు షాహీదుల్ల , రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి అసదుల్లా బాషా, జిల్లా అధ్యక్షులు ముహమ్మద్ ఇర్షాద్ , డైరీ కమిటీ చైర్మన్ హాజీ అబ్దుల్ హకీమ్, కో - చైర్మన్ సయ్యద్ సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

రేపటి నుంచి యోగా బ్యాచ్ ప్రారంభం

కడప అర్బన్ : పటేల్ రోడ్డులో ఉన్న మిత్ర యోగా సెంటర్‌లో 30 రోజుల పాటు నిర్వహించబోయే యోగా శిక్షణ కొత్త బ్యాచ్ ఈనెల 2 నుంచి ప్రారంభించనున్నట్లు యోగా నిపుణులు డాక్టర్ కల్పన, డాక్టర్ రంగనాథరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణలో రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి, అధిక బిపి, డయాబెటిస్, ఒబేసిటీ వంటి దీర్ఘకాలిక సమస్యల నివారణకు, ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుకోవడానికి అవసరమైన యోగాసనాలు, ప్రాణాయామం, సూర్యనమస్కారాలు, షట్ క్రియలు, ధ్యానం వంటి యోగా ప్రక్రియలను శాస్త్రీయంగా సాధన చేయిస్తామని తెలిపారు ఉదయం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు మొదటి బ్యాచ్, 9 గంటల నుంచి 10.30 గంటల వరకు మహిళలకు రెండో బ్యాచ్ ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9848861206, 7013238986లలో సంప్రదించాలని తెలిపారు.

రేపటి నుంచి జిసిఎం ఆధ్వర్యంలో కిడ్స్ క్యాంప్

కడప అర్బన్ : నగరంలోని మాసాపేటలో ఉన్న బేతెస్థ ప్రార్థన మందిరంలో జూన్ 2,3 తేదీలలో కిడ్స్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు చర్చి ప్రెసిడెంట్ జలతోటి ప్రభుదాస్, సెక్రటరి తాళ్లమోపూరి భాస్కర్ బాబు ఒక సంయుక్త ప్రకటన లో తెలిపారు. బద్వేలుకు చెందిన గాస్పల్ చిల్డ్రన్స్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు వీరదాసరి భాస్కర్, దైవ సేవకురాలు వి.సునీత వారి బృందం ఆధ్వర్యంలో కిడ్స్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటాయని తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కడప అర్బన్ : సిఎం జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే మరిచారని, వెంటనే ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే పెండింగ్‌లో ఉన్న అలవెన్సులు వెంటనే విడుదల చేయాలన్నారు. జగన్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, లేనిపక్షంలో రానున్న కాలంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఇసుక అక్రమాలపై ఉక్కుపాదం

పాదయాత్రలో నారా లోకేష్

దారిపొడవునా లోకేష్ దృష్టికి సమస్యల వెల్లువ

ప్రొద్దుటూరులో ఘన స్వాగతం



ప్రొద్దుటూరు నిర్వహించిన లోకేష్ యువగళం పాదయాత్రకు భారీ సంఖ్యలో హాజరైన ప్రజలు

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్/ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్

తెలుగుదేశం ప్రభుతం అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్నానదిలో ఇసుక అక్రమ తవ్వకాలపై ఉక్కుపాదం మోపుతామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 112వ రోజుకు చేరుకుంది. బుధవారం వైఎస్ఆర్ జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలోని దేవగుడి విడిది కేంద్రం నుంచి సలివెందుల, దేవగుడి గ్రాస్ మీదుగా ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని చౌడూరులోకి ప్రవేశిస్తుంది. అక్కడి నుంచి శంకరాపురం, పెద్దశెట్టిపల్లె, నరసింహాపురం, చౌటపల్లి విడిది కేంద్రం వరకూ పాదయాత్ర సాగింది. ఆయా ప్రాంతాల్లో పద్మశాలి సామాజిక వర్గీయులు, స్థానికులు, రైతులు, ఎంఆర్‌పిఎస్ నాయకులుతో ముఖాముఖి, మాటామంతి, సమావేశాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పాదయాత్ర సందర్భంగా పలుచోట్ల లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుక మొత్తాన్ని జగన్ అండ్ కో పొరుగు రాష్ట్రాలకు తరలిస్తూ అడ్డగోలు దోపిడీకి తెరలేపారని తెలిపారు. నాలుగేళ్లలో ముఖ్యమంత్రి జగన్ ఇసుకపై రూ.10 వేల కోట్లు దోచుకున్నారని విమర్శించారు. ఇసుక మాఫియా కారణంగా అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి 61 మంది అమాయకులు బలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొద్దుటూరు, పరిసర గ్రామాల ప్రజల తాగునీటికి ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. ఇసుక పాలసీని సరళతరం చేసి స్థానికంగా ప్రజలకు ఇసుకను అందుబాటులోకి తెస్తామని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే చేనేతపై ఉన్న 5 శాతం జీఎస్టీ భారం పడకుండా చేస్తామని తెలిపారు. టిడ్కో ఇళ్లు, కామన్ వర్కింగ్ షెడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. చంద్రన్న భీమా పథకాన్ని మళ్లీ ప్రవేశ పెడతామని పేర్కొన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత మగ్గాల సంఖ్య తగ్గిపోయిందన్నారు. ప్రభుత్వం నుండి సాయం లేక చేనేత కార్మికులు ఇతర రంగాలకు వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మగ్గం ఉన్న చేనేత కార్మికులకు 200 యూనిట్ల విద్యుత్ అందజేస్తామన్నారు. చేనేత క్లస్టర్స్ ఏర్పాటు చేసి ప్రత్యేక బ్రాండింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. జగన్ నిర్వాకం కారణంగా గ్రామాల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లడానికి కూడా పంచాయతీల వద్ద నిధుల్లేని పరిస్థితి నెలకొందన్నారు. పలువురు సర్పంచ్‌లు పరువు కోసం సొంత డబ్బులు ఖర్చుపెట్టి పనులుచేసి, బిల్లులు రాక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తామన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం కుదైలైందన్నారు. అసమర్ధ విధానాలతో రైతాంగం ఆత్మహత్యల్లో ఏపీని దేశంలోనే ముందు వరుసలో నిలిపారని తెలిపారు.. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, టిడిపి కడప పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు మల్లెల లింగారెడ్డి, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జులు భూపేష్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో లోకేష్‌కు ఘన స్వాగతం

జమ్మలమడుగు నియోజకవర్గం నుంచి ప్రొద్దుటూరులోకి లోకేష్ యువగళం పాదయాత్ర ప్రవేశించించిన సందర్భంగా ఆయనకు జివి ప్రవీణ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. లోకేష్‌కు స్వాగతం పలికేందుకు పెద్ద సంఖ్యలో మహిళలు తరలివస్తున్నారు.. లోకేష్‌తో సెల్ఫీలు దిగేందుకు మహిళలు, యువకులు పోటీపడ్డారు. అందరిని ఆప్యాయంగా పలకరిస్తూ వారితో సెల్ఫీలు దిగారు. స్వాగతం పలికిన వారిలో ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యేలు వరదరాజులరెడ్డి, లింగారెడ్డి, టిడిపి నాయకులు సురేష్ నాయుడు, ముక్తియర్, ఇవి సుధాకర్‌రెడ్డి తదితర నాయకులు ఉన్నారు.

నేడు చలో డిప్యూటీ సిఎం క్యాంపు కార్యాలయం

కడప అర్బన్ : షామీరా మసీద్ బ్రిడ్జి, లా కాలేజ్ బ్రిడ్జ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ ఒకటో తేదీన చలో డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయం నిర్వహిస్తున్నామని డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం. ఓబులేసు పేర్కొన్నారు. బుధవారం డివైఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షామీరియా మసీద్, లా కాలేజ్ బ్రిడ్జిల ఏర్పాటు కోసం 8 నెలలుగా ప్రజా సంఘాలు, డిఇకు వినతి పత్రాలు సమర్పిస్తున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. డిప్యూటీ సిఎం రవీంద్ర నగర్ పర్యటన నేపథ్యంలో స్థానిక ప్రజలు బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తే రూ. 6 లక్షల నిధులు విడుదల చేస్తామని, పనులు ప్రారంభి స్తామని చెప్పి దాదాపు ఐదు నెలలు పూర్తవుతున్నా ఎలాంటి చర్యలు చేపట్టలేదని పేర్కొన్నారు. దీంతో కార్మికులు, విద్యార్థులు, మహిళలు డ్రెయినేజీ నీటి లోనే రాకపోకలు సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కార్పొరేషన్ అధికారులు స్పందించి బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని కోరారు.

నష్టపరిహారం మంజూరు చేయిస్తాం : ఎమ్మెల్యే

ఒంటిమిట్ట (సిద్ధవటం) : సిద్ధవటం మండలం పెద్దపల్లి గ్రామపంచాయతీలో ఇటీవల గాలి బీభత్సంలో దెబ్బతిన్న అరటి, బొప్పాయి, మామిడి, తోటలు ధ్వంసమయ్యాయని, బాధిత రైతులకు త్వరలో నష్టపరిహారం మంజూచు చేయిస్తామని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన నష్టపోయిన పంటలను పరిశీలించారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రైతులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్ పర్సన్ ఏకుల రాజేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ ప్రతాప్ నాయుడు, ఉప సర్పంచ్ నాగం నరసింహారెడ్డి మాజీ సర్పంచ్ కె.వి సుబ్బయ్య మండల రైతు విభాగం కన్వీనర్ పల్లె సుబ్బరామిరెడ్డి, వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ డైరెక్టరు మురళి, తహశీల్దార్ శంకర్రావు అగ్రికల్చర్ ఏవో రమేష్‌రెడ్డి విఆర్ఒ నాని పాల్గొన్నారు.

ఉచిత వేసవి శిక్షణ విజయవంతం

కడప అర్బన్ : నగరంలోని అక్కాయపల్లిలో మహమ్మదీయ సిద్దీఖ్ మసీదు కమిటీ ఆధ్వర్యంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న ఇస్లామిక్ ఉచిత వేసవి శిబిరం విజయవంతంగా ముగిసిందని నిర్వాహకులు పేర్కొన్నారు. శిబిరంలో దాదాపు 150 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. రిటైర్డ్ ఆచార్యులు డాక్టర్ సత్తార్ సాహిర్ అధ్యక్షత వహిస్తు వేసవి కాలంలో ధార్మిక విద్య, మత అవ గాహన, మానవతా విలువలు పై శిక్షణ పొంది ఉత్తమ పౌరులు గా వ్యవ హరించాలని సూచించారు. మసీదు కమిటీ సభ్యులను, మత గురువులను అభినందించారు. 150 విద్యార్థులకు ప్రశంసాపత్రలు, మొమెంటొలు, మెడల్స్ బహూకరించారు కార్యక్రమంలో ప్రముఖ ఉర్దూ సాహితీవేత్త సత్తార్‌ఫైజీ, ఇస్హాఖ్ బాష, మార్కెటింగ్ మేనేజర్ మలబార్ గోల్డ్, డాక్టర్ హిదాయతుల్లా, సామాజిక కార్యకర్త డాక్టర్ తాహిర్, ఖూన్ కా రిష్తా తారీఖ్,మత గురువులు అమీర్‌బాష, జబీవుల్లా, జలీల్, ప్రోగ్రాం కన్వీనర్ మగ్బుల్ అహ్మద్, మసీదు కమిటీ సెక్రటరీ సుబ్హాన్, తల్లి దండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - కడప




సమావేశంలో మాట్లాడుతున్నకాంగ్రెస్ నాయకులు

మహిళ రెజ్లర్లను లైంగికంగా వేధించిన బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని ఎఐసిసి సభ్యులు బండి జకరయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్, కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్యామల డిమాండ్ చేశారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జాతీయంగా, అంతర్జాతీయంగా దేశం గర్వించే విధంగా అనేక పతకాలు సాధించిన మహిళా మల్లయోధులపై ఎంపీ బ్రిజ్ భూషణ్ లైంగికంగా వేధించారని పోలీసు కేసు పెట్టినా ఎఫ్ఐ ర్ చేయకపోవడం దురదృష్టకరం అని వారన్నారు. సుప్రీం కోర్టు చెబితే కానీ ఎఫ్ ఐ ఆర్ లు చేయలేదు అని తెలిపారు. బిజెపి ప్రభుత్వం చట్టాన్ని తమకు అనుకూలంగా మార్చుకుని ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తోందని వాపోయారు. దోషులను శిక్షించే వరకూ రెజ్లర్లకు తోడుంటామని, ఇందులో భాగంగా జూన్ 1న కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం ఇస్తామని చెప్పారు. సమా వేశంలో జిల్లా కార్యదర్శి కదిరి ప్రసాద్ గౌడ్, కృష్ణవేణి, సూరీడు పాల్గొన్నారు.

పొగాకుకు దూరంగా ఉండాలి

కాశినాయన : పొగాకు వాడటం వల్ల అనేకమంది కేన్సర్ బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉందని, ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ఆరోగ్య విస్తరణాధికారులు శ్రీనివాస్‌రెడ్డి, సుబ్బరాయుడు పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ పొగాకు దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన నర్సాపురంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. పొగాకు వాడటం వల్ల అనేక రకమైన కేన్సర్ వ్యాధులు వస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా పంటి, గొంతు కేన్సర్ వచ్చే ప్రమాదముందని చెప్పారు. గుట్కాలు పూర్తిగా నిషేధించాలన్నారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్స్ శారద, ఆరోగ్య పర్యవేక్షకులు నాగమణి, బాలయ్య, ఫార్మసీ సుబ్బరాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఆరోగ్య విస్తరణాధికారులు, వైద్య సిబ్బంది

'కేతు' సేవలు నిరుపమానం : విసి

ప్రజాశక్తి - కడప అర్బన్



కేతు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విసి

ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులుగా బ్రౌన్ గ్రంథాలయానికి చేసిన సేవలు నిరుప మానమని వైవీయూ విసి ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు. బుధవారం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డితో కలిసి ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వి సి మాట్లాడుతూ ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి కథకునిగా, విద్యావేత్తగా, పరిశోధకునిగా నిరంతర సృజనశీలిగా సుప్రసిద్ధులన్నారు. మొదటి నుంచి తన చుట్టూ ఉన్న సమాజాన్ని నిశితంగా పరిశీలించి శాస్త్రీయ దృక్పథంతో మానవ సంబంధాలను విశ్లేషించి రచనలు చేశారన్నారు. జిల్లాలో ఉన్న సామాన్యుల జీవితాల్లో సంభవించే అన్నికోణాలను తనదైన మార్క్సిస్టు దృక్పథంతో ఆవిష్కరించారన్నారు. ఆయన వ్యాసాలు, నాటకాలు, నాటికలు రాసినా తెలుగు సాహిత్యలోకంలో కథకునిగా శాశ్వత స్థానాన్ని సంపాదించుకున్నారని చెప్పారు. అధ్యాపకుడిగా, పరిశోధనకుడిగా, పాత్రికేయుడిగా, బహుశాస్త్ర వేత్తగా, కథకుడిగా, విమర్శకుడిగా అనేక ప్రక్రియల్లో ఆయన గణనీయమైన కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథపాలకులు ఎన్.రమేశ్‌రావు, జి.హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, మౌనిక, పాఠకులు రంగ, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

వాలంటీర్లకు సన్మానం

ప్రజాశక్తి-కలసపాడు



కలసపాడు : వాలంటీర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సుధా

మండలంలో ఉత్తమ సేవలందించిన వాలంటీర్లకు బుధవారం బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ మహబూబ్‌బీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు అందజేయడంలో వాలంటీర్లు ఎప్పుడూ ముందున్నారని చెప్పారు. అనంతరం ఉత్తమ వాలంటీర్లను సన్మానించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి అంకన గురివిరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు పురుషోత్తమ్‌రెడ్డి, ఎంపిపి బోదనబోయిన నిర్మల నారాయణ, రాజుపాలెం సర్పంచ్ సుధా రామకృష్ణారెడ్డి, మండల వైస్ ఎంపిపి భాస్కర్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ చిత్తా రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ శివలీల, రాంబాబు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

కాశినాయన : మండలానికి సంబంధించిన వాలం టీర్లలో సేవ వజ్రాకు ఎన్నికైన అజ్మీర్‌కు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వాలంటీర్ అజ్మీర్ చేసిన సేవా కార్యక్రమాలను ప్రభుత్వం గుర్తించి సేవ వజ్రాకు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సుధా వాలంటీర్‌కు రూ. 30 వేల నగదు, ప్రశంసా పత్రాలు అందజేసి సన్మానించారు.

రక్తదాన పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అఫ్జల్‌ఖాన్

'రక్తదానం చేద్దాం - జిల్లాను రక్త దాతల జిల్లాగా మారుద్దాం ' అనే రక్తదాన పోస్టర్లను బుధవారం మారుతి నగర్ లోని తన కార్యాలయలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 14న ప్రపంచం రక్తదాన దినోత్సవం సందర్భంగా 1 నుంచి 14 వరకు కడప నగరంలో రక్తదాన ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్న ఐఆర్‌సి సీనియర్ లైఫ్ సభ్యులు అబ్దుల్ రాయల్ కరీముల్లా సేవలు అభినంద నీయమని అన్నారు. ప్రతి ఒక్క యువత, ఆరోగ్యవంతులు, విద్యావంతులు, రక్తదానం చేయటానికి ముందుకు రావాలన్నారు.

కొడాలి నాని క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న చెన్నంశెట్టి మురళీకృష్ణ

కడప అర్బన్ : వైసిపి ఎమ్మెల్యే కొడాలి నాని కాపులను దూషించడంతో కాపుల మనోభావాలు దెబ్బతిన్నాయని వెంటనే ముఖ్యమంత్రి జగన్ జోక్యం చేసుకుని భేషరత్ గా క్షమాపణ చెప్పించాలని గ్రేటర్ రాయలసీమ బలిజ సంఘం అధ్యక్షుడు చెన్నంశెట్టి మురళీకృష్ణ కోరారు. బుధవారం ఆయన సొంత కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాపులను లక్ష్యంగా చేసుకుని గతంలో చిరంజీవిని, పవన్ కళ్యాణ్ ను విమర్శించారని పేర్కొన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఉందంటే బలిజల మద్దతుతోనే అన్నది తెలుసుకోవాలన్నారు. కొడాలి నాని చే క్షమాపణ చెప్పించి పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా బలిజ సంఘం కార్యదర్శి సాగబాల రెడ్డయ్య, ఉపాధ్యక్షులు ఉప్పు శ్రీనివాసులు పాల్గొన్నారు.

శాంతి సామరస్యానికి ఎమ్మెల్యే సహకరించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరులో శాంతిసామరస్యం పరిఢవిల్లేందుకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి సహకరించాలని టిడిపి నాయకులు కోరారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌బాబు పాదయాత్ర సందర్భంగా పట్టణంలో శివాలు ప్రాంతాల్లో స్థానిక టిడిపి నాయకులు స్వాగత బ్యానర్లు ఏర్పాటు చేశారు. ఈ బ్యానర్లను చించివేసిన నేపథ్యంలో టిడిపి నాయకులు స్థానిక పివిసిఆర్ మండపంలో బుధవారం విలేకరులతో టిడిపి నాయకుడు సురేష్‌నాయుడు మాట్లాడుతూ లోకేష్ పాదయాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన స్వాగత బ్యానర్లు చించడం శోచనీయమన్నారు. ఇలాంటి సంస్కృతి ప్రొద్దుటూరు చరిత్రలో లేదన్నారు. ఎంపిటిసి, వరదరాజులరెడ్డి, లింగారెడ్డి కాలం నుండి తాను రాజకీయం చూస్తున్నానని ఇలాంటి సంస్కృతి ఎప్పుడూ చూడలేదన్నారు. ఈ విధానం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. బ్యానర్లు చించిన వారిని గుర్తించి గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. లోకేష్ పాదయాత్రను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ముక్తియార్, పార్టీ పట్టణ అధ్యక్షులు ఇవి సుధాకర్‌రెడ్డి, నాయకులు శెట్టిపల్లి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులను నిషేధించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పొగాకు వినియోగం ఆరోగ్యానికి హానికరమని కౌన్సిలర్ వరికూటి ఓబులరెడ్డి అన్నారు. సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (సిర్డ్స్) ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు విష కోరల నుండి దేశ ప్రజలను విముక్తుల్ని చేసేందుకు జాతీయ స్థాయిలో సమగ్ర వ్యూహం రూపొందించాలన్నారు. వైద్యాధికారి సునీల్‌కుమార్ మాట్లాడుతూ చుట్ట, బీడీ, సిగరెట్, గుట్కా వంటి పొగాకు ఉత్పత్తులను వాడడం వల్ల సంభవించే వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు సుబ్బారెడ్డి, చంద్రశేఖరరెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

చాపాడు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శ్రీవాణి ఆధ్వర్యంలో పురవీధులలో పొగాకు వ్యతిరేక దినోత్సవ సందర్భంగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పొగాకు వ్యతిరేకంగా 'పొగాకు ఆరోగ్యానికి హానికరం, ధూమపానం మద్యం-జీవితమే వద్దు' అని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ కావ్య మాధురి, డాక్టర్ ఓబులేష్, సిహెచ్ఓ రాముడు, సూపర్వైజర్ సరస్వతి, క్లస్టర్ పర్యవేక్షకులు నారాయణరెడ్డి, ఆరోగ్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : పొగాకు పదార్థాల మానేసి ఆరోగ్యాన్ని కాపాడుకుందామని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డేవిడ్ సెల్వన్ రాజ సూచించారు. అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పులివెందుల ప్రాంతీయ ఆసుపత్రి, నెహ్రూ యువ కేంద్రం, స్త్రీశక్తి అమృత హస్తం సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో నల్లపురెడ్డిపల్లి ప్రాథమిక వైద్యశాల ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ డేవిడ్ సెల్వన్ రాజు, నల్లపురెడ్డిపల్లి ప్రాథమిక వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రదీప్ ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీలో రక్షిత మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఖథ్ శ్రీ, డాక్టర్ మైనద్దీన్, డాక్టర్ ముక్తియార్, డిపిఎం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కామనూరు సచివాలయంలో వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామాలను పొగాకు రహితంగా మార్చటం కోసం గోపవరం, దొరసానిపల్లె, చౌటిపల్లెలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సిహెచ్ఓ క్రిష్ణయ్య, సూపర్వైజర్ చంద్రకళ, స్టాఫ్‌నర్స్ విజయమ్మ, సీనియర్ అసిస్టెంట్ మధు, సిహెచ్ఓలు నాగేంద్ర, దుర్గమ్మ, రాజ్ లక్ష్మీప్రసాద్, ఆరోగ్యకార్యకర్తలు నాగ సుహాసిని, సుప్రజ, విజయ పాల్గొన్నారు.

వైసిపి, టిడిపి మేనిఫెస్టోలు కాంగ్రెస్‌కు సరిరావు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వైసిపి, టిడిపి మేనిఫెస్టోలు కాంగ్రెస్ మేనిఫెస్టోకు సరిరావని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకొస్తే 6 సూత్రాల కార్యక్రమాన్ని అమలు చేస్తామన్నారు. రైతు ఆత్మహత్యల్లో రాష్ట్రం జాతీయ స్థాయిలో 3వ స్థానంలో, కౌలు రైతు ఆత్మహత్యల్లో 2వ స్థానంలో ఉందన్నారు. వీరికి మేలు చేసేలా రూ.6లక్షల వరకు వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తామన్నారు. మహిళలకు మేలు జరిగేలా విధానాలు రూపొందిస్తామన్నారు. ప్రతి నిరుపేద కుటుంబానికి నెలకు రూ.6వేలు ఆర్థిక సహాయం చేస్తామన్నారు. ప్రత్యేకహోదా అమలు చేస్తామన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ అమలు చేస్తామన్నారు. విభజన చట్టంలోని మిగిలిన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ ఇన్‌ఛార్జి నజీర్, కార్యదర్శి జిలాన్ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరబల్ల శివకుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన డిసిహెచ్ఎస్ హిమజదేవికి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో కరెంటు పోతే ఆల్టర్నేట్ జనరేటర్ సౌకర్యం లేదన్నారు. జనరేటర్ ఉన్నా ఉపయోగకరంలో లేకపోవడంతో వేసవి కాలంలో రోగులు మరింతగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఆర్థోపెడిక్, రేడియాలజిస్టు డాక్టర్లు లేకపోవడంతో అవస్థలు వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డిసిహెచ్ఎస్ హిమజాదేవి స్పందిస్తూ ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యల్ని ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో హాజీ, కమాల్ బాషా పాల్గొన్నారు.


గిరిజనులను ఆదుకోవాలని లోకేష్‌కు వినతి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

తమను ఆదుకోవాలని చిటిమిటిచింతల (పాటి)లోని గిరిజన తండా ప్రజలు నారా లోకేష్‌కు వినతి పత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు లోకేష్‌తో మాట్లాడుతూ జీఓ.నెం.52 రద్దు చేయాలన్నారు. 2007లో బ్రాహ్మణి స్టీల్ ఫ్యాక్టరీకి తమ ప్రాంత వ్యవసాయ భూముల నివ్వామని, వారు భూమి పాసుపుస్తకాలు తీసుకొని నామ మాత్రపు పరిహారం చెల్లించారన్నారు. ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బి.హనుమంత నాయక్, క్రిష్ణా, నరసింహా, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన ముత్తూరు ఉప సర్పంచు

ఖాజీపేట: టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌బాబు చేపట్టిన యువ గళం పాదయాత్ర ప్రొద్దుటూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా బుధ వారం ముత్తూరు ఉప సర్పంచు ముత్తూరు రమణతో పాటు పలువురు టిడిపి నాయకులు లోకేష్ ను కలిసి తమ సంఘీభావాన్ని తెలిపారు. రానున్న ఎన్నికల్లో టిడిపి తప్పక ఘన విజయం సాధిస్తుందని పేర్కొన్నారు.



లోకేష్‌ను కలిసిన ముత్తూరు రమణ

ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలి

- ఎస్ఎఫ్ఐ నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండల పరిధిలోని సోమిరెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడుకింద రూ.3 లక్షల 93 వేల పాఠశాల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని, వాటిని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాధాకృష్ణ గోల్‌మాల్ చేశారని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గండి సునీల్‌కుమార్ ఆరోపించారు. స్థానిక సుందరయ్య భవనంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దీనిపై కమిటీ చైర్మన్, గ్రామస్తులు విద్యాశాఖాధికారులకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా.. వచ్చిన ఉన్నత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.

అబద్దాల స్క్రిప్ట్ చదివిన నారా లోకేష్

- బహిరంగ చర్చకు సిద్ధమా అని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సవాల్

ప్రజాశక్తి - జమ్మలమడుగు

టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ మంగళవారం సాయంత్రం జమ్మలమడుగులో నిర్వహించిన బహిరంగసభలో అబద్దాల స్క్రిప్ట్ చదివారని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ లోకేష్ యువగళం బహిరంగ సభలో తనపై, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చేసిన అసత్య ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. పార్టీ రథసారధి అయిన నారా లోకేష్ తప్పుడు స్క్రిప్ట చదివి అసత్య ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. రైతుల గురించి మాట్లాడడం, వారి సమస్యలను పరిష్కరిస్తామని లోకేష్ చెప్పడం హాస్యాస్పదమన్నారు. లోకేష్ బహిరంగసభ ద్వారా జమ్మలమడుగు నియోజకవర్గానికి ఎలాంటి ప్రయోజనం చేకూరాలేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డికి కనీసం గ్రామాల పేర్లు ఉచ్చరించడం కూడా రాదన్నారు. రాజోలి ప్రాజెక్టుపై టిడిపి ఎలాంటి స్పష్టత ఇవ్వలేదన్నారు. ఉక్కు నిర్మాణం దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయమని, దాన్ని పూర్తిచేసే బాధ్యత తమపై ఉందన్నారు. గండికోట నిర్వాసితులకు రూ.10 లక్షలిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని ఫేస్ టులో అందరికీ ఇచ్చామని తెలిపారు. దేవగుడి కుటుంబంతోపాటు ఉన్న నాయకులు 2018లో గండికోట టూరిజంలో గ్యాంబ్లింగ్ ఆడుతూ పట్టుబడడం నిజం కాదా అని ఆయన ప్రశ్నించారు. అలాగే 2020లో ప్రస్తుత ఎమ్మెల్సీ దేవగుడి శివనాథరెడ్డి గ్యాంబ్లింగ్ ఆడుతూ ఉంటే పోలీసులు కేసు నమోదు చేయడం వాస్తవం కాదా అని ఆధారాలను సైతం విలేకరులకు బహిర్గతం చేశారు. ఇలాంటి వారు రాజకీయ నాయకులు అని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి 2019లో టిడిపి అభ్యర్థి పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డితో రూ.60 లక్షలు తీసుకుని ఆ పార్టీకి ప్రచారం చేయడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఆదినారాయణరెడ్డి వైసిపి నుండి తెలుగుదేశం పార్టీలోకి మారుతున్న సమయంలో రెండు కోట్లు డిమాండ్ చేసి తీసుకున్న చరిత్ర ఉందని ఆరోపించారు. ప్రస్తుత ఎమ్మెల్సీ దేవగుడి శివనాథ్ రెడ్డి మండలి ఎన్నికలలో తనతో చర్చలు జరిపి తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేసి కియా కార్ తీసుకోవడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అలాంటి నీచ రాజకీయ సంస్కృతి ఒక్క దేవగుడి కుటుంబానికే దక్కుతుందన్నారు. మూడు తరాల నుండి తన కుటుంబం రాజకీయంగా జమీందారుల కుటుంబమని, తమకు 2000 ఎకరాల భూస్వాములమని తెలిపారు. తనపై చేసిన అసత్య ఆరోపణలపై దేవగుడి గ్రామంలో బహిరంగ చర్చకు తాను సిద్ధమని ఎమ్మెల్యే దేవగుడి కుటుంబానికి సవాల్ విసిరారు. తనను 2024 ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, మార్కెట్ యార్డ్ చైర్మన్ రమణారెడ్డి, కొండారెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు లక్ష్మయ్య, కౌన్సిలర్లు, నాయకులు బేపారి షామీర్ అలీ, కిరణ్‌కుమార్, గురివిరెడ్డి, వేణు యాదవ్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నక్కలదిన్నె పిహెచ్‌సి నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని నక్కలదిన్నెలో రూ.2.50కోట్లతో నూతనంగా మంజూరైన పిహెచ్‌సి నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, వైద్య అధికారులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని సూచించారు. ఇప్పటికే ఇద్దరు వైద్య సిబ్బందిని నియమించామని, త్వరలో పూర్తిస్థాయిలో సిబ్బందిని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మయ్య, అదనపు డీఎంహెచ్ఓ ఖాదరవల్లి, ఆర్అండ్‌బి అధికారులు, మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్, వైద్యులు శ్రీవాణి, ఓబులేసు, కావ్య మాధురి, మాజీ జెడ్పిటిసి ఎస్ఆర్ బాల నరసింహారెడ్డి, నాయకులు మహేశ్వర్‌రెడ్డి జయరామిరెడ్డి, జయసుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి, సంఘన హరినాథ్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, గంగులయ్య, వైద్య సిబ్బంది రాముడు, సరస్వతి పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

గాయత్రి మహాపీఠానికి భూమిపూజ

మైదుకూరు మండల పరిధిలోని బద్వేల్ రోడ్డులో గంగితిప్ప వద్ద గాయత్రి మహాపీఠానికి బుధవారం ఎమ్మెల్యే భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీ గాయత్రి మహాపీఠం యూనిట్ నిర్వాహకులు వెంకటేశ్వర్ నాయుడు, ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ ఎంఎన్ రాణి, 1098 నోడల్ ఆఫీసర్ రాఘవేంద్ర, ప్రజలు పాల్గొన్నారు.

పులివెందులకు సూక్ష్మ సేద్యం అవార్డు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మండలంలోని ఇ.కొత్తపల్లి గ్రామానికి భారత ప్రభుత్వం సూక్ష్మ సేద్యం అవార్డు ప్రకటించింది. బుధవారం ఢిల్లీలో వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో భారత దేశంలోని 28 రాష్ట్రాల ప్రభుత్వాలు, ప్రతినిధులు, రైతు ఉత్పత్తి సంఘాలు, డ్రిప్ కంపెనీ ప్రతినిధులు, అంకురా సంస్థలు, సర్పంచులు, ఫర్ డ్రాప్ మోర్ క్రాప్ ఆధ్వర్యంలో వర్క్ షాప్ జరిగింది. దేశంలో ఇప్పటివరకు 30 మిలియన్ల హెక్టర్‌లో డ్రిప్, స్ప్రింక్లర్లు రాయితీపై పంపిణీ ఏడేళ్ల నుండి అందించడం జరిగిందని, భారత ప్రభుత్వం 70 మిలియన్ హెక్టర్‌లు విస్తరణకి డ్రిప్, స్ప్రింక్లర్‌లు రాయితీపై ఇవ్వడానికి నిర్దేశాలు పెట్టుకోవడం జరిగింది. ఈ లక్ష్యం సాధించడానికి వర్క్‌షాపు ఏర్పాటు చేశారని పులివెందుల ఉద్యానవన శాఖ అధికారి రాఘవేంద్రారెడ్డి తెలిపారు. దేశంలో సూక్ష్మ సేద్యంలో మంచి ఫలితాలు సాధిస్తున్న ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్రకు అవార్డు ఇవ్వడం జరిగిందన్నారు. ఇ.కొత్తపల్లి గ్రామానికి అవార్డు రావడం అభినందనీయమన్నారు. గ్రామ సర్పంచు బాల నాగప్రసాద్‌కు భారత ప్రభుత్వం అవార్డు ప్రదానం చేసింది. కార్యక్రమానికి రాష్ట్రం నుండి హరినాథ్‌రెడ్డి, ప్రాజెక్ట్ ఆఫీసర్, ఏపీఎంఐపీ, రాయచోటి జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి వెంకటేశ్వరరెడ్డి, పులివెందుల ఉద్యాన అధికారులు రాఘవేంద్రారెడ్డి, రత్న కుమార్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేయడంతో బుధవారం ఆయన పులివెందులకు చేరుకుని ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విషయం తెలుసుకున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలి వచ్చారు. ఈ సందర్భంగా అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమస్యలను అడిగి తెలుసుకుని కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. అలాగే సంబంధిత అధికారులతో మాట్లాడుతూ సమస్య పరిష్కరించేలా అధికారులను కోరారు. కార్యక్రమంలో పులివెందుల పాడా ప్రత్యేక అధికారి అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న అవినాష్‌రెడ్డి

శ్మశానానికి దారి చూపించకపోతే ఆందోళన : సిపిఎం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

పట్టణంలో శ్మశాన స్థలం కాపాడడంలో, దారి చూపటంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సిపిఎం మండల కార్యదర్శి సాన గోవింద్ విమర్శించారు. స్థానిక సుందరయ్యభవన్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ బి.మఠంలోని కొత్తూరు, పాతురు, వీరనారయణపురం, విరాట్‌నగర్, కక్కయనగర్, పోలేరమ్మ నగర్, విరాట్ నగర్, ప్రభునగర్, జింకలనగర్, సుందరయ్య నగర్, భగత్‌సింగ్ నగర్, వీరభద్రపురం ప్రాంతాల ప్రజలు అంతక్రియల కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారి బాధలు వర్ణనాతీతమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రెవెన్యూ అధికారులు శ్మశానానికి దారి చూపించాలని, ఆక్రమణకు గురైన స్థలాలను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సునీల్‌కుమార్, నరసింహ, రాహుల్, ఆంజనేయులు, గురయ్య పాల్గొన్నారు.

రసాభాసగా కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక నగర పంచాయతీలో సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. సమావేశంలో పలు అభివృద్ధి పనులపై కౌన్సిలర్ల ఆమోదానికి ఎజెండాను ప్రవేశపెట్టారు. ఇందులో శానిటరీ వాహనాల రిపేర్లు, ఎల్ఇడి బల్బులు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వాటి పూడికతీత, సీసీ కెమెరాల ఏర్పాటు, పైప్‌లైన్ లీకేజీలు, మోటర్లు వంటి వాటికి నిధులకు సంబంధించి కౌన్సిల్ ఆమోదానికి ఎజెండాలో పొందుపరిచారు. ఒక సందర్భంలో కౌన్సిలర్లు మేమేమన్నా బఫూన్లమా అని కమిషనర్‌ను ప్రశ్నించారు.

అట్టహాసంగా బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జమ్మలమడుగు పట్టణంలోని పలగాడి వీధిలో వెలసిన సయ్యద్ షా బడే గౌస్ పీరా కాదిరి 91వ ఉరుసు మహోత్సవం సందర్భంగా పతంగి రామన్నరావు ప్రభుత్వ పాఠశాల మైదానంలో బండలాగుడు పోటీలను నిర్వహించారు. మొదటగా ఆస్థాన ఏ గౌసియా పీఠాధిపతి సయ్యద్ షా ఖాదిరి వారు ఎడ్ల పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో నంద్యాల జిల్లాకు చెందిన పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన ఎడ్లు మొదటి బహుమతిని సాధించాయి. రెండవ బహుమతి సింగనమల మండలం చక్రాయపేట గ్రామానికి చెందిన ఎడ్లు గెలుచుకున్నాయి. మైలవరం మండలం చిన్నకొమ్మెర్ల గ్రామానికి చెందిన ఎడ్లు మూడో బహుమతిని సాధించాయి. మొదటి బహుమతి సాధించిన ఎడ్ల యజమానులకు రూ.50వేలు, రెండో బహుమతిగా రూ.45వేలు, మూడో బహుమతిగా రూ.40 వేలు పీఠాధిపతి అందించారు. కార్యక్రమంలో సయ్యదిశ నిజాముద్దీన్ ఔలియా ఖాద్రి, సయ్యద్ షా తాహిర్ పీరా ఖాద్రి, అతహర్ ఖాద్రి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చికెన్ ధరలను తగ్గించం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పట్టణంలో అధికంగా చికెన్ ధరలు ఉన్నాయని, చికెన్ వ్యాపారులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ముడుపులు ఇస్తున్నారని వచ్చిన ఆరోపణల్లో నిజంలేదని వ్యాపారులు తెలిపారు. టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ మంగళవారం స్థానికంగా నిర్వహించిన బహిరంగసభలో చికెన్ వ్యాపారులు ఎమ్మెల్యేకు ముడుపులు ఇస్తున్నారని చేసిన ఆరోపణలకు వారు స్పందించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం చికెన్ వ్యాపారులు విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో చికెన్ ధర కిలో రూ.240 విక్రయిస్తున్నామన్నారు. అధిక ధరలను తగ్గించే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే సమక్షంలో తేల్చి చెప్పారు. ఇతర ప్రాంతాల కంటే జమ్మలమడుగు పట్టణంలో అధిక ధరలో ఉన్నాయని ప్రజలు వాపోతున్న సంగతి విదితమే. అయినప్పటికీ తాము ధరలు తగ్గించబోమని వ్యాపారులు పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ నగర పంచాయతీ అధికారులకు చికెన్ అధిక ధరలపై సమావేశం నిర్వహించాలని ఆదేశాలిచ్చామన్నారు. ధరలు తగ్గించకుంటే చికెన్ దుకాణాన్ని సీజ్ చేయాలని ఆదేశాలిచ్చామన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, వైసిపి పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్లు పోచిరెడ్డి, గౌరీనాథ్, కో-ఆప్షన్ సభ్యులు లక్ష్మయ్య, మార్కెట్ యార్డ్ చైర్మన్ రమణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లోకేష్‌ది ఒంటిపూట పాదయాత్ర : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

లోకేష్ పాదయాత్ర ఒంటిపూట పాదయాత్రగా కానసాగుతోందని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి ఎద్దేవా చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాటాడుతూ లోకేష్ ఓ బాటసారిలా పాదయాత్ర చేసినట్లుందన్నారు. గుడారం నుండి సాయంత్రం 4గంటలకు బయటకు వచ్చి సాయంత్రపు నడక చేస్తున్నట్లుందన్నారు. గతంలో దివంగతనేత వైఎస్, ముఖ్యమంత్రి జగన్ పాద యాత్రలు ప్రజాసమస్యల పరిష్కారం దిశగా సాగాయని గుర్తు చేశారు. వైసిపి శ్రేణులు లోకేష్‌ను ఓ అతిథిగా మనం గౌరవించాలన్నారు. ఎలాంటి ఆటంకాలు సృష్టించవద్దని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మిదేవి పాల్గొన్నారు.

టిడిపి బలోపేతానికి పనిచేయాలి

వేంపల్లె : మండలంలో టిడిపి బలోపేతానికి ప్రతి కార్యకర్త పనిచేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామమునిరెడ్డి మాట్లాడుతూ బూత్‌ల వారీగా పార్టీని బలోపేతం చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రతి బూత్‌కు 10 మంది కార్యకర్తలు యూనిట్‌గా కలిసి పార్టీ ప్రకటించిన మహాశక్తి మేనిఫెస్టోను ప్రజలకు తెలియజేయాలని కోరారు. వేంపల్లె మండలంలో టిడిపి అభ్యర్థి బిటెక్ రవీంద్రరెడ్డికి అత్యధిక మెజార్టీ తీసుకొచ్చేందుకు పని చేయాలన్నారు. వైసిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత ప్రతి టిడిపి కార్యకర్త, నాయకుడిపై ఉందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జయచంద్రారెడ్డి, ఆర్‌వి రమేష్, పూల అల్లాబకష్, మహమ్మద్ ఇనాయతుల్లా, జబిబుల్లా, శ్రీను, ఈశ్వరయ్య, గోగుల మారుతి, గోగుల మల్లికార్జున, వేమిరెడ్డి బాలకృష్ణారెడ్డి, మల్లి, ఎద్దుల శేషారెడ్డి, వెంకటయ్య, ఆది, డక్కా రమేష్, వంశీ, పలువురు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

పథకాల అమలులో వాలంటీర్ల పాత్ర కీలకం

ఖాజీపేట : ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల అమలులో వాలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలు మరువలేనివని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి అన్నారు. స్థానిక టీచర్స్ కాలనీలోని షాదీఖానామందిరంలో బుధవారం ఉత్తమ సేవలందించిన వాలంటీర్లను సన్మానించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకం వర్తించేలా వాలంటీర్లు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ రాష్ట్ర డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్‌రెడ్డి, జడ్పీ కో-ఆప్షన్ సభ్యులు అచ్చుకట్ల కరీముల్లా, ఎంపీపీ అబు బకార్ సిద్దిక్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు చంద్రభాస్కర్‌రెడ్డి, సహకార సంఘం అధ్యక్షులు పీవీ రాఘవరెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యులు మున్వర్ హుస్సేన్, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కారు, స్కూటర్ ఢీ : వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని నందిపాడు కాలనీ సమీపంలో కడప-కర్నూలు జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్త నెల్లూరు గ్రామానికి చెందిన శివకృష్ణ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. మదనపల్లి నుంచి హైదరాబాద్ వెళుతున్న కారు ముందుపోతున్న స్కూటర్‌ను ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

అక్రమంగా తరలిస్తున్న వెండి పట్టివేత

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

అక్రమంగా వెండి ఆభరణాలను తరలిస్తున్న షేక్ అజారుద్దీన్ అనే వ్యక్తిని మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం సేలంకు చెందిన షేక్ అజారుద్దీన్ అనే వ్యక్తి 9.8 కిలోల వెండి ఆభరణాలను తరలిస్తూ ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ సమీపంలో పట్టుబడినట్లు తెలిపారు. వెండికి సంబంధించి బిల్లులు లేకపోవడంతో వెండిని, నిందుతుడిని సేల్ టాక్స్ వారికి అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.